క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

తిరుపతి తుడా: ఆఫీసర్స్ సోషియల్ అండ్ కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో స్విమ్స్ ఉచిత సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు, బ్లడ్ బ్యాంక్, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఆదివారం ఎల్ఐసీ రోడ్డులోని ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించిన ఈ శిబిరంలో శ్రీ సాయి సుధా హాస్పిటల్, సిద్ధా క్లినికల్ రీసెర్చ్ యూనిట్ సిబ్బంది సేవలందించారు. క్లబ్ ప్రెసిడెంట్ మోహన్ సిద్ధారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఆదికృష్ణయ్య మాట్లాడారు. స్విమ్స్ ఆధ్వర్యంలో తొలిసారి తాము వైద్య శిబిరం నిర్వహించి 368మంది ప్రజలకు వైద్య సేవలు అందించడం సంతోషంగా ఉందన్నారు. పింక్ బస్సుల సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, సాయి సుధా హాస్పిటల్ వైద్యులు డాక్టర్ సుకుమార్, స్విమ్స్ ఆసుపత్రి వైద్యులు, సంఘం సభ్యులు హాజరయ్యారు.

నియామకం



మురళికి నియామక పత్రం ఇస్తున్న క్రిష్ణన్

తిరుపతి కల్చరల్: ఇండియన్ హ్యూమన్ రైట్స్, యాంటీ కరప్షన్ సెల్ ఆలిండియా అధ్యక్షుడిగా తిరుపతికి చెందిన డాక్టర్ కాణిపాకం మురళి ఎన్నికయ్యారు. సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నూతన క మిటీ ప్రతినిధులను ఎంపిక చేశారు. ఆయన తో పాటు ఆలిండియా ప్రధాన కార్యదర్శిగా ఎం.హరిబాబు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కంకలపాటి వినోద్‌కుమార్ నియమితులయ్యారు. ఇండియన్ హ్యూమన్ రైట్స్, యాంటీ కరప్షన్ ఆలిండియా చైర్మన్, మద్రాస్ హైకోర్టు విశ్రాంత జడ్జి యస్‌కే క్రిష్ణన్ మాట్లాడుతూ.. నూతన కమిటీ ప్రతినిధులు రాష్ట్ర కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే సదస్సులు నిర్వహిస్తూ ప్రజలకు మానవ హక్కులపై అవగాహన కల్పించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంస్థ నగర అధ్యక్షుడు ఎస్.దేవిశ్రీ ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు అంబులెన్సుకు మోక్షం




వినియోగంలోకి వచ్చిన నూతన అంబులెన్సు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో నిరుపయోగంగా ఉన్న కొత్త అంబులెన్సు ఎట్టకేలకు మోక్షం లభించింది. యూనియన్ బ్యాంక్ కార్పొరేట్ సేవా కార్యక్రమంలో భాగంగా వర్సిటీ హెల్త్ సెంటర్‌కు సుమారు రూ.34లక్షల విలువ గల అంబులెన్స్‌ను విరాళంగా అందజేసింది. కానీ దీనిని అధికారులు వినియోగంలోకి తేలేదు. దీనిపై జీవీఎస్ విద్యార్థి సంఘం నాయకుడు శివశంకర్ నాయక్ వీసీ సీహెచ్ అప్పారావు దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం సమర్పించారు. విద్యార్థులు, ఉద్యోగులకు అత్యవసర పరిస్థితులలో వైద్య సేవలకు అంబులెన్స్‌ను వినియోగంలోకి తేవాలని కోరారు. దీనిపై వీసీ సానుకూలంగా స్పందించారు. అలాగే అంబులెన్సు ఉంచేందుకు షెడ్ నిర్మించాలని ఆదేశించారు.

నృత్యం.. మంత్రముగ్ధం



చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. వారాంతపు కార్యక్రమంలో భాగంగా చెన్నైకు చెందిన సుధారజన్, కైరాలి నృత్య కళాలయం, సంగీత శివ కుమార్, శ్రీశంకర నాట్య విద్యాలయం ఆధ్వర్యంలో సుధారాజన్ బృందం ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశాయి. కళాకారులు శ్రీనిధి, తంగబాల, కనిష్క, పల్లవి, సంయుక్త, మహాలక్ష్మి, సాధన, తానీష, జ్యోషిత, కీర్తి, కార్తీక, సాయి హర్షిణి, తనుశ్రీ చక్కని అభినయంతో ఆకట్టుకున్నారు. అనంతరం ఏఓ సుధాకర్ కళాకారులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.




నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

నిప్పుల కుంపటి..!

- భారీగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఏప్రిల్‌లోనే 42 డిగ్రీలు దాటుతున్న వైనం
- వృద్ధులు, బాలింతలు, చిన్నారులు జాగ్రత్త వహించాలంటున్న డాక్టర్లు



ఫ్లై ఓవర్ పైనే కాకుండా దిగువన సైతం నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు మార్గం



తిరుపతి తుడా: సూర్యుడి ప్రతాపంతో జిల్లా అగ్నిగుండంగా మారుతోంది. వడగాల్పులు ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలు దాటుతుండడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 8గంటలకే భానుడి ప్రతాపం చూపుతుండడంతో జనం రోడ్లపైకి వెళ్లాలంటేనే జంకుతున్నారు. మధ్యాహ్నం 2గంటల నుంచి పట్టణాలలో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో రైతులు, కూలీలు, ఉపాధి హామీ పనులకు వెళ్లే వారి పరిస్థితి దారుణంగా తయారైంది. వడదెబ్బ కేసులు జిల్లాలోని అన్ని ఆసుపత్రులలో పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

వచ్చే నెలలో 45 డిగ్రీలు దాటే అవకాశం

గత ఏడాది ఇదే సమయానికి 40 డిగ్రీల వరకు ఉన్న ఉష్ణోగ్రతలు ఈ ఏడాది ఇప్పటికే 42డిగ్రీలు దాటడం గమనార్హం. జిల్లాలో వచ్చే నెలలో 45 డిగ్రీలు దాటే అవకాశం ఉన్నట్లు వాతావరణ అధికారులు చెబుతున్నారు. ఫలితంగా వడదెబ్బ బాధితులు భారీ సంఖ్యలో పెరిగే అవకాశం కూడా లేకపోలేదు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులు వీలైనంత వరకు అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

వడదెబ్బ లక్షణాలు

- విపరీతమైన తలనొప్పి, వాంతులు వచ్చే పరిస్థితి ఏర్పడటం
- నాలుక తడిబారిపోవడం, కళ్లు మసకబారడం
- శరీర ఉష్ణోగ్రతలు అమాంతంగా పెరగడం
- కళ్లు తిరగడం, మాట తడబడటం
- శరీరం నీరసించి నేలకొరగడం, జ్వరం బారిన పడటం
- శరీరం తిమ్మిరి పట్టి నరాలు లాగడం
- నీటి శాతం తగ్గి డీహైడ్రేషన్‌కు గురికావడం

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- అధిక ఉష్ణోగ్రత ఉన్న సమయంలో బయటకు రాకుండా జాగ్రత్త వహించాలి
- రోజూ సుమారు 5లీటర్ల వరకు మంచి నీరు, ద్రావణాలు తీసుకోవాలి
- కొబ్బరి నీరు, ఓఆర్ఎస్‌లను వాడాలి
- జ్వరం, నీరసం అనిపించినప్పుడు వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి
- వేసవిలో తేలికపాటి వ్యాయామాలు మాత్రమే చేయాలి
- దోస, పుచ్చకాయ, నిమ్మ, దానిమ్మ వంటి నీటి శాతం అధికంగా ఉండే పండ్లను తీసుకోవాలి
- అత్యవసర పరిస్థితులలో బయటకు రావాల్సి వస్తే కాటన్ దుస్తులు, గొడుకు వాడాలి

గత ఐదు రోజులుగా జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు

రోజు	ఉష్ణోగ్రతలు (డిగ్రీలు)
23వ తేదీ	43.5
24	42.5
25	44.8
26	45.0
27	45.2

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వేసవి ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. వృద్ధులు, పిల్లలు, బాలింతలు బయట తిరగకుండా జాగ్రతలు పాటించాలి. పండ్లు, జ్యూస్‌లు, మజ్జిగ, ఓఆర్ఎస్‌లు తీసుకోవడం మంచిది. వీలైనంత ఎక్కువగా నీరు తీసుకోవాలి. శరీరం నీరసించి ఉష్ణోగ్రతలు పెరిగిన వెంటనే తడిగుడ్డతో శరీరాన్ని తుడుచుకోవడంతో పాటు వెంటనే వైద్యులను సంప్రదించాలి. పగటి వేళలలో అవసరమైతే తప్ప బయటకు రాకపోవడం మంచిది

–డాక్టర్ యువ అన్వేష్, హెల్తాఫీసర్, మున్సిపల్ కార్పొరేషన్, తిరుపతి

నోటీస్ బోర్డు

- జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రీవెన్స్ సెల్‌లో ప్రజా సమస్యలపై వినతులు, ఫిర్యాదుల స్వీకరణ.
- ఏపీపీఎస్సీ పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు.
- ఇస్కాన్ రోడ్డులోని రామకృష్ణ మిషన్ ఆశ్రమంలో సంస్కార శిబిరం ఉదయం 10 గంటలకు ప్రారంభం.
- తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, 9.30 నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం.

భవన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తిరుపతి కల్చరల్: భవన కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి పరిష్కరించి ఆదుకోవాలని బాలాజీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మలకప్పం శేఖర్ డిమాండ్ చేశారు. తిరుమల బైపాస్ రోడ్డులోని శిరిడి సాయి మందిరంలో యూనియన్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఎంతో మంది గృహ నిర్మాణ రంగంలో పని చేస్తున్నా అద్దె ఇళ్లల్లో కష్టాల నడుమ జీవనం సాగిస్తున్నారని, ప్రతి కార్మికుడికి ఇంటి స్థలం కల్పించడంతో పాటు వారి బతుకులకు భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి జె.రమణ, కోశాధికారి సుబ్రమణ్యం, ఉపాధ్యక్షుడుర అల్లాబక్ష్, కార్యదర్శి జీవీ.రమణ, కృష్ణమూర్తి, శ్రీనివాసులు, రాజశేఖర్, ప్రసాద్, రమేష్ నాయుడు, కార్మికులు పాల్గొన్నారు.

వేడుకగా సిటీ ఛాంబర్ ఉగాది పురస్కారాలు



లా కాలేజీ చైర్మన్ డాక్టర్ తిప్పారెడ్డిని జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్ : వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందిస్తున్న వారికి ఆదివారం మహతి కళాక్షేత్రంలో తిరుపతి సిటీచాంబర్ ఉగాది పురస్కారాలు ప్రదానం చేసింది. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మాజీ మంత్రి పరసారత్నం, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు మోహన్, సుగుణమ్మ ముఖ్య అతిథులుగా హాజరై సమాజ సేవకులను పురస్కారాలతో సత్కరించి అభినందించారు. ప్రముఖ న్యాయ కళాశాల చైర్మన్ డాక్టర్ తిప్పారెడ్డి, సమాజ సేవకుడు మందలపు మోహనరావులకు జీవిత సాఫల్య పురస్కారాలు అందజేశారు. అలాగే చార్టెడ్ అకౌంటెంట్ ఎంఆర్ఎస్.శ్రీనివాస్, కార్పొరేటర్ అన్నా అనిత, కక్కార్ సి.అర్చన, ఎల్.వెంకటరమణ, డాక్టర్ పి.గోపాల్, శాంబోలు హరినాథ్ ,ఎస్.సరళకు ఉగాది పురస్కారాలు, పద్మజకు ప్రత్యేక గౌరవ పురస్కారంతో సత్కరించారు. సిటీ ఛాంబర్ వ్యవస్థాపకులు అయూబ్‌ఖాన్, షణ్ముగం యాదవ్‌ను ముఖ్యఅతిథులు అభినందించారు. డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ, గత 28 ఏళ్లుగా సిటీ ఛాంబర్ నిర్వహించే కార్యక్రమాలలో తాను పాల్గొంటున్నానని, ఛాంబర్ నిర్వహించిన ఎన్నో వైద్య శిబిరాల్లో తానూ పాల్గొని సేవలు అందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో చైర్మన్ కేఎస్.వాసు, ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ స్టాన్లీ జయకుమార్, డాక్టర్ కరుణానిధి, పీసీ.స్వామి, స్వరాజ్యలక్ష్మి, వేణు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వేసవి శిబిరాలు

తిరుపతి అర్బన్: గ్రంథాయశాఖ వేసవి విజ్ఞాన శిబిరాలు సోమవారం నుంచి ప్రారంభించనున్నట్టు స్థానిక గోవిందరాజుల స్వామి ఆలయ సమీపంలోని ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయాధికారి సూర్యనారాయణ మూర్తి ఆదివారం తెలిపారు. 40 రోజుల నిర్వహించే ఈ శిబిరంలో పిల్లలకు కథలు వినిపించడం, పుస్తకాలు చదవడం, పుస్తక సమీక్షలు, కథలు చెప్పించడం, డ్రాయింగ్, క్విజ్ పోటీలు మొదలైనవి నిర్వహిస్తామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు నిర్వహించే శిబిరానికి పిల్లలను తల్లిదండ్రులు పంపాలని కోరారు.

చంద్రగిరిలో..

చంద్రగిరి: స్థానిక పాతపేటలోని గ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారిణి రెడ్డమ్మ ఆదివారం తెలిపారు. జూన్ 6వ తేది వరకు నిర్వహించే ఈ కార్యక్రమాల్లో కథలు చదవడం, పుస్తక పఠనం, జీకే, క్విజ్, డ్రాయింగ్, చెస్, క్యారమ్స్ ..మొదలైన వాటిల్లో రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు శిక్షణ ఇస్తామని, అలాగే వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు ఇవ్వనున్నట్టు చెప్పారు. దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

1 నుంచి శిల్పారామంలో వేసవి శిక్షణ తరగతులు



వేసవి శిక్షణ తరగతుల కరపత్రాలను విడుదల చేస్తున్న శిల్పారామం ఏఓ సుధాకర్

చంద్రగిరి: వేసవి సెలవులు సందర్భంగా తిరుపతి శిల్పారామంలో పిల్లలకు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు ఏఓ సుధాకర్ తెలిపారు. ఆదివారం ఆయన శిల్పారామంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. శాస్త్రీయ నృత్యం, మట్టి కుండలు, మట్టి బొమ్మల తయారీ, డ్రాయింగ్ తరగతులు మే 1 నుంచి 31వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామని, 6 నుంచి 16 ఏళ్లలోపు విద్యార్థులు దీనికి అర్హులన్నారు. అన్నింటికీ శిక్షణకుగాను రూ.1,000 చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని, శిక్షణానంతరం ధ్రువపత్రాలను ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు వస్తువులను వారే తీసుకురావాలని, మరిన్ని వివరాలకు 8886652044, 8886652016 నంబర్లను సంప్రదించాలని కోరారు.

బంగారు డిస్కౌంట్స్, ఆఫర్లపై జాగ్రత్త



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వినియోగదారుల సంఘం ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: అక్షయ తృతియ పేరిట బంగారు వ్యాపారుల డిస్కౌంట్స్, స్పెషల్ ఆఫర్లపై వినియోగదారులు జాగ్రత్త వహించాలని జిల్లా వినియోదారుల సంఘం అధ్యక్షుడు పి.రాజారెడ్డి హెచ్చరించా రు.బంగారు కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదివారం ఆదివారం సంఘ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ముద్రించిన బీఐఎస్ హాల్ మార్క్ ఆభరణాలు మాత్రమే కొనుగోలు చేయాలని, ఇది బంగారు స్వచ్ఛత ధృవీకరణకు, మోసాలు నివారణకు దోహదపడుతుందని తెలిపారు. హాల్ మార్క్, స్వచ్ఛతకు, క్యారెట్ల వివరాలకు 6 సంఖ్యలు గల హాల్ మార్క్ యూనిక్ ఐడీ నంబర్లు గమనించాలని, మీ మొబైల్‌లో బీఐఎస్ క్యార్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని సులువుగా తెలుసుకోవచ్చని తెలిపారు. కొన్న బంగారు విలువ తిరిగి పొందడానికి చైతన్యవంతులై ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసులు, డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, ప్రతినిధులు సుధీర్, చంద్రశేఖర్, శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.

జనసేన నేతపై పోలీసులకు ఫిర్యాదు

- సోషల్ మీడియాలో అసత్య ఆరోపణలపై ఆగ్రహం



జనసేన నేతపై ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత మల్లం చంద్రమౌళి రెడ్డి

చంద్రగిరి: ఉద్దేశపూర్వకంగా తన తండ్రిపై అసత్య ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన జనసేన నేతపై చర్యలు తీసుకోవాలని నరసింగాపురం సింగిల్‌విండో మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నేత మల్లం చంద్రమౌళి రెడ్డి ఆదివారం రాత్రి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ అనితకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విశ్రాంత టీచరైన తన తండ్రి విశ్వనాథరెడ్డికి 80 ఏళ్లని, ఆయన అనారోగ్యం కారణంగా ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారన్నారు. తన భార్య తొండవాడ పంచాయతీ సర్పంచ్‌గా పార్టీలకతీతంగా సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన జనసేన నాయకుడు మురళిరెడ్డి ఆదివారం సోషల్ మీడియాలో తన తండ్రి ఇంట్లో పనిచేస్తున్న మహిళపై అఘాయిత్యానికి పాల్పడినట్లు తప్పుడు ఆరోపణలు చేస్తూ వాట్సప్, ఫేస్‌బుక్, ఇతర సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని, తనపై కూడా అసత్య ఆరోపణలు చేశారని, రాజకీయంగా దెబ్బతీయాలనే కుట్రతో ఉద్దేశపూర్వకంగానే కుటుంబ పరువు తీయాలని ఇలా పోస్టులు పెట్టినట్లు ఆయన అన్నారు. గతంలో కూడా అతనిపై హత్యాయత్నం కేసు ఉందని, మరోవైపు జర్నలిస్టు పేరుతో కూడా బెదిరింపులకు పాల్పడుతున్న అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకువాలని ఎస్ఐని కోరినట్లు తెలిపారు.

కోనో కార్పస్ మొక్కలు హానికరం కాదు..

- పర్యావరణవేత్త ప్రొఫెసర్ బయ్యపురెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పర్యావరణవేత్త ప్రొఫెసర్ బయ్యపురెడ్డి

తిరుపతి కల్చరల్: తెలుగు రాష్ట్రాల్లో కోనో కార్పస్ మొక్కలు పర్యావరణానికి, ఆరోగ్యానికి హానికరమంటూ ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించడానికి స్వస్తి పలికి, బహుళ ప్రయోజనాలున్న ఆ మొక్కలను రక్షించాలని ప్రముఖ పర్యావరణవేత్త, ఆచార్య నాగార్జున వర్శిటీ పూర్వ వృక్షశాస్త్ర ప్రొఫెసర్ కె.బయ్యపురెడ్డి విజ్ఞప్తి చేశారు. జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో కోనో కార్పస్ మొక్కలపై మీడియాతో జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి అధ్యక్షతన ముఖాముఖి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కోనో కార్పస్ మొక్క ప్రపంచంలో మొదట యెమెన్ దేశంలో సహజ సిద్ధంగా పెరుగుతూ ప్రపంచంలో అత్యధిక దేశాలకు విస్తరించిందన్నారు. గల్ఫ్ దేశాలలో నీరు లభించక పోయినా కోనో కార్పస్ మొక్కలు ఆయా దేశాల మొక్కలలో 70 శాతానికిపైగా పెరిగి పచ్చదనాన్ని అందిస్తున్నాయన్నారు. ఈ మొక్కలు వాతావరణంలోని కార్బన్ డయాక్సైడ్‌ను అత్యధికంగా తీసుకుంటూ అత్యధిక ఆక్సిజన్‌ను ఈ చెట్టు ఇస్తుందని పేర్కొన్నారు. వాయు, ధ్వని కాలుష్యాల నుంచి ప్రజలను ఈ మొక్కలు రక్షిస్తాయన్నారు. ఈ చెట్ల వల్ల ఏ ఆరోగ్య సమస్యలూ తలెత్తవని స్పష్టంచేశారు. బెంగుళూరులోని అంతర్జాతీయ విద్యాసంస్థలు వేలాది కోనో కార్పస్ మొక్కలతో నిండి ఉన్నాయని, అక్కడ ఏ ఒక్క విద్యార్థికి ఆస్తమా, అలర్జీ సమస్యలు రాలేదంటూ ఆ మొక్కల ప్రయోజనాలను గురించి దృశ్య మాధ్యమం ద్వారా వివరించారు. జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ, కోనో కార్పస్‌పై అపోహలను తొలగించి వాటి ప్రయోజనాలను వివరించేందుకు తెలుగు రాష్ట్రాల్లో సదస్సు, చర్చాగోష్టులు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో ఏపీకౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పూర్వ కార్యదర్శి, జియాలజీ ప్రొఫెసర్ టీవీ.కృష్ణారెడ్డి, ఆలిండియా నేషనల్ బీసీ ఫ్రంట్ కన్వీనర్ కెఎంఎల్. నరసింహ పాల్గొన్నారు.

ఉగ్ర దాడులకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ






కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు, హిందూ ధర్మవాదులు నిర్వహిస్తున్న ర్యాలీ

తిరుపతి కల్చరల్: కశ్మీర్‌లో పర్యాటకులపై దాడులు చేసిహతమార్చిన పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులపై భారత్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ తిరుపతి ప్రకాశం మున్సిపల్ పార్క్ వాకర్స్ ఆదివారం మున్సిపల్ పార్క్ నుంచి లీలామహల్ సర్కిల్ వరకు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. మౌనం పాటిస్తూ మృతులకు నివాళులు అర్పించారు. కేంద్రం ఉగ్రమూకలను, వారికి సహకరిస్తున్న పాక్‌ను అణిచి వేయాలని నినదించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపినాథ్, కార్యదర్శి చంద్రకాంత్, గౌరవాధ్యక్షుడు వెంకటరెడ్డి, కె.దేవప్రసాద్, బీవీ.కేశవులు, కోలా లక్ష్మీపతి, భక్తవత్సలం, టి.దాసు, వెంకటముని, మునిబాబు, గురునాథ్, మస్తాన్, రాజేశ్వరి, మునిరత్నం, శంకరయ్య, సుబ్బయ్య, భాస్కర్, సత్య మహేష్, వెంకటేష్, మధు, సభ్యులు పాల్గొన్నారు. అలాగే ఉగ్రవాదుల దుశ్చర్యను ఖండిస్తూ తుడా మైదానం నుంచి గాంధీ రోడ్డులోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వరకు రాధా మనోహర్ దాస్ ఆధ్వర్యంలో హిందూ ధర్మవాదులు నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్, గుండాల గోపినాథ్, జి.పృథ్వీ రెడ్డి డి.మహేష్, కరుణాకర్‌రెడ్డి, రెడ్డి శేఖర్, వేణు రాయల్, నిర్మలమ్మ, న్యాయవాది మాసుమయ్య, సుబ్రమణ్యంరెడ్డి, విజయకుమార్ పాల్గొన్నారు.

ఉగ్రదాడి మృతులకు నివాళి



తిరుపతి కల్చరల్: కశ్మీర్‌లోని పెహల్గామ్‌లో ఉగ్రవాదుల ఘాతుకానికి మృతి చెందిన పర్యాటకులకు ఆత్మశాంతి కలగాలని రెడ్డి బిజినెస్ గ్రూప్ తిరుపతి చాప్టర్ సభ్యులు మౌనం పాటిస్తూ నివాళులర్పించారు. ఆదివారం రామానుజ సర్కిల్లోని ఓ హోటల్లో తిరుపతి చాప్టర్ సభ్యులు సమావేశమయ్యారు. తొలుత ఉగ్రదాడులను ఖండిస్తూ చాప్టర్ నేతలు మాట్లాడారు. ఉగ్రవాదుల దుశ్చర్యపై భారత్‌తోపాటు ప్రపంచదేశాల్లో సైతం నిరసనలు వ్యక్తమవుతున్నా ఉగ్రవాద ప్రేరేపిత పొరుగు దేశం తీరు మాత్రం మారలేదని నిరసన వ్యక్తం చేశారు. ఆ దేశ ప్రధానితో సహా సైన్యాధ్యక్షుడు అవాకులు చెవాకులు పేలుతూనే ఉన్నారని, ఉగ్రవాదులకు, పొరుగుదేశానికి కలలో కూడా ఊహించని విధంగా కేంద్రం గుణపాఠం చెప్పడానికి గట్టి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తర్వాత తిరుపతి చాప్టర్ ఉద్దేశం, లక్ష్యాలను, వ్యాపారాభివృద్ధికి సభ్యుల మధ్య పరస్పర సహకారం, పేద విద్యార్థులకు చేయూత..ఇత్యాది అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు ఏనుగు శ్రీనివాసులురెడ్డి, వినోద్‌రెడ్డి, లక్ష్మీ రాజశేఖర్, వినోద్‌కుమార్‌రెడ్డి, అరగొండ శేఖర్‌రెడ్డి, సుమతిరెడ్డి, రూపారెడ్డి, ఎం.సంజీవ్‌రెడ్డి, తిరుపతి జిల్లా పోలీస్ అసోసియేషన్ నేతలు శంకర్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. చిత్తూరు, నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య, కడప జిల్లాల సభ్యులతో పాటు హైదరాబాద్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అటవీ 'స్వచ్ఛాంధ్ర'



తిరుపతి మంగళం: తిరుపతి అటవీ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరుపతి తీర్థం సమీపంలోని అటవీశాఖ కార్యాలయం ప్రాంగణాలలో, నగరవనంలో వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు.

డ్రోన్ కెమెరాలతో పోలీసుల వేట



డ్రోన్‌తో కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

పాకాల : మండలంలో అసాంఘిక కార్యక్రమాలకు చెక్ పెట్టే దిశగా పోలీసులు డ్రోన్ కెమెరాలతో వేట ప్రారంభించారు. ఆదివారం స్థానిక సీఐ సుదర్శన్ ప్రసాద్ ఆధ్వర్యంలో మద్దినాయనపల్లె, శేషాపురం, ఓసీపల్లె, కోనేటోయినియిండ్లు పరిసర ప్రాంతాల్లోని పొలాలు, గుట్టల్లో డ్రోన్ కెమెరాలతో అన్వేషించారు. ఎక్కడైనా సారా కాస్తున్నారా, పేకాట ఆడుతున్నారా? వన్యప్రాణులను వేటాడుతున్నారా? గంజాయ్ బ్యాచ్ ఎక్కడైనా ఉందా? అనే కోణంలో డ్రోన్‌తో గాలించినట్టు పోలీసులు చెప్పారు. కార్యక్రమంలో ఎస్టీఎఫ్ బలగాలు, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే పోటీలలో తిరుపతి యువకుల ప్రతిభ



కరాటే క్రీడాకారులను అభినందిస్తున్న కరాటే ఇండియన్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు, కోచ్‌లు

తిరుపతి కల్చరల్: మలేషియా కౌలాలంపూర్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన 14వ సైలెంట్ నైట్ కరాటే కప్–2025 పోటీలలో తిరుపతికి చెందిన ఇద్దరు యువకులు అసాధారణ ప్రతిభ చాటారు. ఎం .సూర్య మెయిల్ క్యాడెట్ టీం కుమితే విభాగంలో సిల్వర్ మెడల్, వ్యక్తిగత కుమితే విభాగంలో, జూనియర్ టీం కటాలో కాంస్య పతకాలు సాధించాడు. మెయిల్ వ్యక్తిగత టీం కుమితే విభాగంలో బి.మిత్ర కాంస్య పతకం సాధించాడు. వీరు తిరుపతిలోని మార్షల్ ఆర్ట్స్ నిపుణుడు డాక్టర్ పి.నవీన్ వద్ద శిక్షణ పొందారు. క్రీడాకారులకు కరాటే ఇండియన్ ఆర్గనైజేషన్ సహాయ కార్యదర్శి, టీమిండియా హెడ్ కోచ్ సిహాన్ కీర్తన్ కొండూరు, కోచ్ పి.నవీన్, పి.అనిల్ అభినందించారు.